# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో రేపు ఐక్యతా కవాతు నిర్వహించనున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు.**

2. **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**

3. **తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.**

4. **స్థిరమైన అభివృద్ధి అంశాలలో అణు శాస్త్ర సాంకేతికత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.**

5. **తుపాను బాధితులకు ఆర్థిక సాయంతో పాటు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

==========================

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని 'ఏక్ భారత్', 'శ్రేష్ఠ భారత్'కు ప్రతీకగా ఐక్యతా కవాతు నిర్వహించనున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో రేపు జరగనున్న జాతీయ ఐక్యతా దినోత్సవంపై బీహార్‌లోని పాట్నాలో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో అమిత్ షా ఈరోజు పాల్గొని ప్రసంగించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న ఏక్తా నగర్‌లో నిర్వహించే ఈ కవాతును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని అన్నారు. కేంద్ర సాయుధ పారామిలిటరీ దళాలతో పాటు, రాష్ట్రాల పోలీసు దళాలు, దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్... 25 సెకన్లు

--------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైపుణ్యాభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా చేపట్టిన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నైపుణ్యం పోర్టల్ ఉద్యోగాల డ్యాష్ బోర్డు, నైపుణ్యాలను అందించే వివిధ కోర్సుల గురించి అధికారులతో చర్చించారు.

నైపుణ్యం పోర్టల్ ద్వారా అభ్యర్థులు తమ ఉద్యోగ అర్హతలను తెలిపే బయోడెటాను రూపొందించుకునేలా వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అనంతరం రాష్ట్రంలో తుపాను ప్రభావం, చేపట్టిన సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించనున్నారు.

---------------------------

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు పర్యటించారు. ఇందులో భాగంగా కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండల పరిధిలో వర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అధికారులు పరిశీలించి, అంచనా వేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

---------------------------

కర్నూలును ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలులో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కర్నూలులో రాష్ట్ర హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని మంత్రి వివరిస్తూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

స్థిరమైన అభివృద్ధి, ప్రజారోగ్యం, వ్యవసాయం, నీటి నిర్వహణ వంటి అంశాలలో అణు శాస్త్ర సాంకేతికత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ-IAEA నివేదికపై ఆమె ఈరోజు ప్రసంగించారు. అణు శాస్త్ర సాంకేతికతను శాంతియుత, సురక్షిత భద్రతాయుత ప్రయోజనాల కోసం వినియోగించడంలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు భారత్ మద్దతు తెలుపుతుందన్నారు. అణుశక్తి పరిశోధన రంగాల్లో భారతదేశం పురోగతి సాధిస్తోందని చెప్పారు. భారత్ అంతర్జాతీయ అణుశక్తి సంస్థతో కలసి, భాగస్వామ్య దేశాలతో సామర్థ్య నిర్మాణం, సాంకేతిక సహకారానికి కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

తుపాను బాధితులకు ఆర్థిక సాయంతో పాటు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రాలలో 615 మందికి నిత్యావసర సరుకులను మంత్రి ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, పునరావాసకేంద్రాలలో నిర్వాసితులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 4 వేల 553 మందిని గుర్తించామని, వారందరికీ సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు

---------------------------

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రేపు నెల్లూరులో జరిగే యూనిటీ మార్చ్ కార్యక్రమంలో యువత ప్రజలు పాల్గొనాలని నెల్లూరు లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. నెల్లూరులో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా నెల్లూరులో మై భారత్ నెల్లూరు, ఎన్ఎస్ఎస్, జిల్లా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విఆర్సీ మైదానం నుంచి వేదాయపాలెం వరకు 5 కిలోమీటర్ల పాదయాత్రను నిర్వహించనున్నామన్నారు. దేశ ప్రగతికి వల్లభాయ్ పటేల్ చేసిన అసాధారణ కృషి, వారసత్వాన్ని స్మరించుకుంటూ యూనిటీ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో తుపాను బాధిత ప్రాంత రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పశుసంవర్ధ శాఖ చర్యలు చేపట్టిందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా డైరెక్టర్ టి. దామోదర్ నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, గాలులు, వర్షాల కారణంగా కొన్నిచోట్ల పశు నష్టం జరిగిందని, వాటి వివరాలను ప్రభుత్వానికి అందచేస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాలలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు.

---------------------------

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు లైన్ల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరులో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్తు అందించే వ్యవసాయ కనెక్షన్లను సాయంత్రంలోపు పునరుద్ధరిస్తామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజికి వరద నీటిని అధికారులు విడుదల చేశారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజి వద్ద ప్రస్తుత ఇన్ ఫ్లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉందని చెప్పారు. బ్యారేజికి ఇదే స్థాయిలో వరద నీరు చేరితే సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు, లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నదిలో ప్రయాణించడం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం వంటివి చేయరాదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

---------------------------

అల్పపీడనంగా బలహీన పడిన 'మొంథా' తుపాను దక్షిణ చత్తీస్‌గడ్ మీదుగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేస్తూ,

వాయిస్ 20 సెకన్లు

====================